మరోసారి దీవించండి.. మరింత అభివృద్ధి చేస్తా..

బిగాలకు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు, ప్రచారం చేస్తున్న బిగాల గణేశ్ గుప్తా

బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా..

ఖలీల్‌వాడి, నవంబర్ 17 : ఎన్నికల్లో తనను మరోసారి దీవించాలని, నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా కోరారు. నగరంలోని 16, 17 డివిజన్లలోని గౌతంనగర్, దుబ్బలో శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొమ్మిదేండ్లలో నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. నగరం మరింత అభివృద్ధి చెందేందుకు, సంక్షేమ పథకాలు అమలుకావడానికి కారు గుర్తుకే ఓటు వేసి తనను మరోసారి గెలిపించాలని కోరారు. స్థానిక యువతకు ఉద్యోగాలు అందించాలన్న ఉద్దేశంతో ఐటీ హబ్ నిర్మాణం చేపట్టామన్నారు. ఆధునిక సదుపాయాలతో వైకుంఠధామాలు, నూతన సమీకృత కార్యాలయాలతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. కార్పొరేటర్ మాయవార్ సవితా రాజు, కో-ఆప్షన్ మెంబర్ చంద్రకళ, మాజీ కార్పొరేటర్లు మాయవార్ సాయిరాం, పంచరెడ్డి సురేశ్, పంచరెడ్డి అనిత, పంచరెడ్డి లక్ష్మణ్, మధుకర్‌రెడ్డి, రమాకాంత్, మాయవార్ సంతోష్, శివ పాల్గొన్నారు.

బిగాలకు మద్దతుగా కుటుంబీకుల ప్రచారం..

అర్సపల్లిలో ప్రచారం చేస్తున్న బిగాల మహేశ్, బీఆర్ఎస్ నాయకులు

నగరంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఖలీల్‌వాడి, నవంబర్ 17 : బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తాకు మద్దతుగా ఆయన కుటుంబీకులు శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. జిల్లాకేంద్రంలోని 15వ డివిజన్‌లో ఉన్న అర్సపల్లిలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకే ఓటు వేసి బిగాలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముచ్కూర్ లావణ్యానవీన్, కులాచారి సంతోష్, చేగంటి గంగాధర్, ఆకుల శ్రీశైలం, అంతరెడ్డి దేవి, కొండపాక రాజేశ్, ఎర్రం గంగాధర్, ఆకాశ్ పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో బిగాల సతీమణి బిగాల లత.. నగర మేయర్ దండు నీతూకిరణ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరంలోని అన్ని డివిజన్లలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ బిగాలకు మద్దతుగా ప్రచారం చేశారు.

అయోధ్య రామయ్యకు పాదుక సేవ

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 17 : ధర్మస్వరూపుడు శ్రీరాముడి కోసం బంగారుపూతతో 9 కిలోల వెండి పాదుకలను తయారుచేయించామని, పాదుకలకు జిల్లా కేంద్రంలోని పలు రామాలయాల్లో నేడు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, జిల్లా వాసి చల్లా శ్రీనివాసశాస్త్రి తెలిపారు. శుక్రవారం గీతాభవన్ ప్రాంగణంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. శ్రీరాముడి పాదుకల సాక్షిగా రాజ్యాన్ని పాలించిన భరతుడి స్ఫూర్తితో వెండి పాదుకలను అయోధ్య రామాలయానికి జనవరి 15న ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. వీటికి జనవరి 22, 2024 నాడు ప్రాణప్రతిష్ఠ చేస్తారని చెప్పారు. అక్టోబర్ 28న కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక నుంచి 200 మందితో పాదయాత్ర బయల్దేరిందని, భద్రాచలం, నాసిక్, త్రయంబకేశ్వర్, చిత్రకూట్, ప్రయాగరాజ్ తదితర ప్రాంతాల మీదుగా 2వేల కిలోమీటర్ల పాదయాత్ర కొనసాగుతుందన్నారు. చల్లా శ్రీనివాస శాస్త్రి వర్ని మండలం శ్రీనగర్ వాసి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మణికొండలో స్థిరపడ్డారు. 1976 నుంచి తెలుగు సినీ పరిశ్రమలో వందల చిత్రాలకు సౌండ్ ఇంజినీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ధార్మికసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

భారత జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి

బహుమతులు అందజేస్తున్న భారత జాగృతి ప్రధానకార్యదర్శి నవీన్ ఆచారి

సిరికొండ, నవంబర్ 17 : క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని భారత జాగృతి ప్రధానకార్యదర్శి నవీన్ ఆచారి అన్నారు. మండలంలోని పందిమడుగు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన కొండాపూర్ యువకులకు ప్రథమ బహుమతి, పందిమడుగు గ్రామ యువతకు ద్వితీయ బహుమతిని జాగృతి ఇటలీ అధ్యక్షుడు తనంకి కిశోర్‌తో కలిసి అందజేసి మాట్లాడారు. భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత యువతను ప్రోత్సహిస్తూ, అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రూరల్ జాగృతి కన్వీనర్ మల్లెల సాయిచరణ్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, గంగనర్సయ్య, వార్డుమెంబర్ సాయన్న, రూరల్ యూత్ కన్వీనర్ సంతోష్, కో-కన్వీనర్ విక్కీ, విద్యార్థి కన్వీనర్ రాము, కో-కన్వీనర్ రాహుల్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ మండలాల కన్వీనర్లు భాస్కర్, మహిపాల్, ధర్మేశ్, జయానంద్, గ్రామ కన్వీనర్లు దత్తు, వినీల్, ప్రేమ్, సుధీర్, దీపక్, నాయకులు రణధీర్, గ్రామపెద్దలు భాస్కర్, ధర్మపురి పాల్గొన్నారు.

నగరంలో విస్తృతంగా వాహనాల తనిఖీ

- రూ.73,290 నగదు స్వాధీనం

నిజామాబాద్ క్రైం, నవంబర్ 17 : ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ప్రత్యేక సిబ్బంది నగరంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై కె.రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సారంగపూర్ ప్రాంతంలో అబ్దుల్ షాదాబ్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా రూ.73,290 నగదు పట్టుబడింది. డబ్బులకు సంబంధించి అతడి వద్ద ఆధారాలు లేకపోవడంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకొని నిజామాబాద్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు.

పీజీ రెగ్యులర్ పరీక్షలకు నోటిఫికేషన్

డిచ్‌పల్లి, నవంబర్ 17 : టీయూ అనుబంధ కళాశాలల పరిధిలో పీజీ పరీక్షలకు నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ/ఎంసీఏ, ఐదు సంవత్సరాల ఐఎంబీఏ కోర్సులకు మూడో, తొమ్మిదో సెమిస్టర్, రెగ్యులర్ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పేర్కొన్నారు. ఫీజు చెల్లించేందుకు వచ్చే నెల 5వ తేదీ వరకు గడువు ఉందని, రూ. 100 అపరాధ రుసుముతో వచ్చే నెల 6వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాల కోసం టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, నవంబర్ 17 : జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా పవర్‌హౌస్, తిలక్‌గార్డెన్, వినాయక్‌నగర్, బోర్గాం, దుబ్బ, న్యూకలెక్టరేట్, ముబారక్‌నగర్, సుభాష్‌నగర్, అర్సపల్లి, మిర్చీ కంపౌండ్, న్యూహౌసింగ్ బోర్డు, గూపన్‌పల్లి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

జక్రాన్‌పల్లి, నవంబర్ 17 : జక్రాన్‌పల్లి పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన వారు ఫోన్లు పోగొట్టుకోగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు శుక్రవారం అందజేసినట్లు డిచ్‌పల్లి సీఐ కృష్ణ తెలిపారు. సుమారు రూ. 3.11 లక్షల విలువచేసే సెల్‌ఫోన్లను డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు మహేశ్, తిరుపతి, ఐడీ టీమ్ సర్దార్, రాజేశ్వర్, లింగం టెక్ టీమ్ కానిస్టేబుల్ భూపతి, భూమేశ్, సతీశ్, సందీప్, అర్చన పాల్గొన్నారు.

నేడు నాటక రంగంపై అవగాహన సదస్సు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 17 : నగరంలోని హరిచరణ్ హిందీ మహావిద్యాలయంలో 'ఇందూరు నాటక రంగం - చరిత్ర అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం ఉంటుందని ఇతిహాస సంకలన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా టీయూ ఆచార్యులు చందుపట్ల ఆంజనేయులు, వక్తగా శ్రీపాద నాటక కళాపరిషత్ వ్యవస్థాపకుడు శ్రీపాద కుమారశర్మ, డా.నాగరాజు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. భాషాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్ పోయినది

చిల్క గణేశ్ తండ్రి చిల్క గంగారాం, ని॥ ఇ.నెం.3-3-307/1 & 3-3-307/2, గాయత్రినగర్, నిజామాబాద్. నా యొక్క ఒరిజినల్ రిజిస్ట్రేషన్ లింకు డాక్యుమెంట్ నెం. 2496/2006, 2497/2006 గలది. గాయత్రినగర్ నుండి వినాయక్‌నగర్‌కు బైక్ పై వెళ్ళుచుండగా పోయినది. దొరికినవారు సంప్రదించగలరు.
Cell:9642552424

కమర్షియల్ కొరకు అద్దెకు ఇవ్వబడును

★నిజామాబాద్ కంఠేశ్వర్ రోడ్ ధనలక్ష్మి బ్యాంక్ బిల్డింగ్ 1st ఫ్లోర్‌లో 2000 Sft. 2nd ఫ్లోర్‌లో 1000 Sft. కమర్షియల్ కొరకు అద్దెకు ఇవ్వబడును. సెల్: 98483 45050
NTZ-318488

WANTED

★రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F పర్సన్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లను 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా పర్సన్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.